క్లుప్తంగా

ప్రభుత్వం నిర్దేశించిన ధరకే టమాటా విక్రయాలు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే రైతు బజారుల్లో టమాటా విక్రయాలు జరుగు తున్నా యని జిల్లా వ్యవసాయ వాణిజ్య , మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్ యాసిన్ తెలిపారు. సోమవారం 'సాక్షి'లో 'మాకొద్దీ టమాటా' శీర్షిక ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రస్తుతం టమాటా ధర విపరీతంగా పెరిగిపోవడంతో చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను దిగుమతి చేసుకుని సీతమ్మధార రైతు బజార్‌లో తక్కువ ధరకు విక్రయాలు జరుపుతున్నామన్నారు.

రెండో రోజు శిక్షా సప్తాహ్



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీదేవి

కంచరపాలెం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 వరకు వారం రోజుల పాటు కంచరపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ రెండోరోజు కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయురాలు శ్రీదేవి పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, పాఠశాల సముదాయపు చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సహ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జీవీఎంసీ కమిషనర్‌ను అభినందనలు తెలుపుతున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్ కుమార్‌ను 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను సత్కరించారు. అనంతరం కమిషనర్‌కు రాజ్యాంగ ప్రధాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బహూకరించారు.

శాకంబరిగా భూలోమ్మ అమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు, రేసపువానిపాలెం గ్రామంలో వెలసిన శ్రీ భూలోమ్మ అమ్మవారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు కూరగాయలతో అమ్మవారిని అలంకరించినట్టు అర్చకుడు సంతోష్ శర్మ తెలిపారు. గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు బేరి గురునాథ్‌రెడ్డి, ఆలయ సెక్రటరీ జీరి అప్పలస్వామి రెడ్డి, కోశాధికారి గాలి శివకుమార్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మజ్జి ఉమామహేశ్వ రరెడ్డి, యాదేశ్వరరెడ్డి, మోకర సాయి తదితరులు పాల్గొన్నారు.

బంగారు వస్తువులు పోగొట్టుకుంటే సంప్రదించండి



బంగారు వస్తువులు

సీతమ్మధార : ఇటీవల బంగారు వస్తువులు పోగొట్టుకుంటే తగిన రశీదులతో ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులను సంప్రదించాలని స్టేషన్ ఎస్‌ఐ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలల కిందట దొండపర్తిలోని ఒక ఆటో డ్రైవర్‌కు మండగొలుసు, డైమండ్ పార్కు దరి సాయి పార్లర్ వద్ద చైను దొరికాయని తెలిపారు. వీటి కోసం ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో 106 బీఎన్‌ఎస్‌ఎస్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. వస్తువులు పోగొట్టుకున్న బాధితులు తగు ఆధారాలతో క్రైం పోలీసులను సంప్రదించాలని, రశీదులు పరిశీలించి వస్తువులు ఇచ్చేస్తామని తెలిపారు.

గళమెత్తాలి.. దశమార్చాలి



'ఎన్నికల ముందు బోలెడు హామీలు ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరుతో పలు ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వీటిలో ఒక్క దాని గురించి కూడా ఇంత వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. అధికారంలోకి వచ్చి దాదాపు 45 రోజులు కావస్తోంది. కక్ష సాధింపులకు స్వస్తి పలికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'అని అంటూ పలువురు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కోరుతున్నారు. ఉత్తర నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి, పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు. –సీతంపేట



2018లో సీతంపేటలో మినీ బజారు ఏర్పాటుకు శంకుస్థాపన చేసి విష్ణుకుమార్ రాజు



సీతంపేట రాజేంద్రనగర్‌లో డంపింగ్ యార్డుగా మారిన ప్రభుత్వ స్థలం

- ఎన్నో చెప్పారు..అవన్నీ నెరవేర్చండి
- అసెంబ్లీలో గళమెత్తండి.. 'ఉత్తర'ను తీర్చిదిద్దండి
- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు ప్రజల వినతి

ఉత్తర నియోజకవర్గంలో 25వ వార్డు ప్రజలు రైతుబజార్ అందుబాటులో లేక ఇటు సీతమ్మధార, అటు నరసింహనగర్ వెళ్లిల్సి వస్తోంది. దూరాభారం కావడంతో అంత దూరం వెళ్లలేక స్థానిక ఉండే బజార్లలో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కనకమ్మ అలయం నుంచి రెల్లివీధి రోడ్డులో మినీబజార్ ఏర్పాటుకు 2018లో అప్పటి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మినీ బజారు ఏర్పాటుపై చొరవ చూపాలి.

హాకర్ జోన్స్ ఏర్పాటు చేయండి

ఉత్తర నియోజకవర్గంలో సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం, శంకరమఠం రోడ్, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మర్రిపాలెం ప్రాంతాలలో రహదారులపై ఎంతో మంది చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొంత మంది రహదారులను, మరి కొంత మంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. రహదారుల ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. వీటిని నియంత్రించేలా చిరు వ్యాపారాల నిర్వహణకు హాకర్ జోన్స్ ఏర్పాటు చెయ్యాలి.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. కోట్ల రూపాయల విలువైన స్థలాల పరిరక్షణ గాలిలో దీపంలా మారాయి. దీంతో విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. 25వవార్డులో రాజేంద్రనగర్ పార్కు, కనకమ్మ వీధిలో ఖాళీ స్థలం, అలాగే 26వవార్డు అక్కయ్యపాలెంలో పద్మశ్రీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్థలం, శాంతిపురం స్కీమ్ ఇళ్ల వెనుక ఉన్నఖాళీ స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. ప్రజలను ఉపయోగపడేలా ప్రభుత్వ స్థలాలను వినియోగంలోకి తేవాలి.

రోడ్ కనెక్టవిటీ కల్పించండి

జాతీయ రహదారికి సమాంతరంగా శంకరమఠం రోడ్ నుంచి కంచరపాలెం వరకు నిర్మించిన 80 అడుగుల రోడ్ చిన్నూరు వద్ద రోడ్‌కనెక్టవిటీ లేక ఏళ్ల తరబడి జనం ఇబ్బంది పడుతున్నారు. కనెక్టవిటీ లేక లక్షల రూపాయలువెచ్చించి నిర్మించిన 80 అడుగుల రోడ్ (శంకరమఠం వైపు) వాహనాల రాంగ్ పార్కింగ్‌కు అడ్డాగా మారింది. చిన్నూరు బ్రిడ్జి వద్ద ఎన్నో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చిన్నూరు వద్ద రోడ్ కనెక్టవిటీ కల్పిస్తే జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. రోడ్ ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంది.



రోడ్ కనెక్టవిటీ లేక అక్రమణకు గురైన అక్కయ్యపాలెం చిన్నూరు రోడ్ (ఫైల్)

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చండి...

ఉత్తర నియోజకవర్గంలో చాలా వరకు స్లమ్స్ ఉన్నాయి. ఎంతో మంది శ్రీకాకుళం, విజయనగరం , విశాఖ గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధికోసం వలస వచ్చి స్థిరపడ్డారు. సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎంతో మంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎంఎన్‌సీ కంపెనీలు ఏర్పాటు అయితే ఉపాధి లభిస్తుంది. ఆదిశగా చొరవ చూపాలి.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి



రామాటాకీస్ రోడ్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సులతో ట్రాఫిక్ చిక్కులు

రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద అలాగే గురుద్వారా కూడలి వద్ద రోజూ పదుల సంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు బారులు తీరుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ సమస్యలకు కారణం అవుతున్నాయి. ఇటు పోలీస్ యంత్రాంగం గానీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు గానీ సమస్య పరిష్కారం కోసం కృషి చెయ్యలేదు. పైగా ప్రైవేట్‌బస్సులకు అనుకూలంగా రామాటాకీస్‌రోడ్‌లో వాహనాల రాకపోకలను నియంత్రించేలా స్టాపర్లు పెట్టి రోడ్లు మూసివేశారు.

కందిపప్పు నాణ్యత పరిశీలన



నరసింహనగర్ రైతుబజార్‌లో కందిపప్పు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారి ప్రవల్లిక

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను పౌరసరఫరాల శాఖ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్ పి.ప్రవల్లిక తనిఖీ చేశారు. విక్రయిస్తున్న సరుకుతో పాటు, ప్యాకింగ్‌లో ఉన్న కందిపప్పు, బియ్యం బస్తాలను పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం యాసిన్ నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. స్టాల్స్‌లో విక్రయిస్తున్న కూరగాయల నాణ్యత, తాజాదనం పరిశీలించారు. ప్రభుత్వం సబ్సిడీపై విక్రయిస్తున్న టమాటల కౌంటర్లు తనిఖీ చేసారు. డ్వాక్రా వ్యాపారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

యువతి అదృశ్యం



మంగాదేవి (ఫైల్)

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. కంచరపాలెం పైడిమాంబ ఆలయం గణేష్‌నగర్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న వి.మంగాదేవి ఈ నెల 19న అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్టు కుటుంబసభ్యులు సీసీ ఫుటేజీలో గమనించారు. దీంతో అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె సోదరుడు వి.సత్యరాజ్ కుమార్ ఈ నెల 21న ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్ భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవుట్ పోస్టు లేక అవస్థలు



అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టు (ఫైల్)

సీతమ్మధార: గతం ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో పోలీస్ అవుట్ పోస్టు ఉండేది. కొద్ది నెలలు క్రితం రోడ్డు వేయడంతో అవుట్ పోస్టు తొలగించారు. అదే స్థానంలో అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో అవుట్ పోస్టు ఉన్నప్పుడు రోడ్డు ప్రమాదాలు తక్కువగా జరిగేవి. ఎస్‌ఐతో పాటు సిబ్బంది అక్కడ విధులు నిర్వహించేవారు.

అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలి



గతంలో అవుట్ పోస్టు ఉండేది. దీంతో నేరాలు అదుపులో ఉండేవి. ట్రాఫిక్ సమస్యలు ఉండేవి కావు. ఇప్పుడు అవుట్ పోస్టు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు ఉంటే కొంత భయం ఉండేది. పోలీసులు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు.

–గుజ్జు గోవర్ధన్... సీతమ్మధార,

నేడు శాకంబరి అలంకారంలో లలితాదేవి

సీతంపేట: ఆషాఢమాసం బహుళ తదియ నాడు అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలోని లలితా కామేశ్వరి అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారని పీఠం మేనేజర్ మన్నం కృష్ణసేన్ తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, పలు నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అబిద్‌నగర్, రామచంద్ర నగర్, టిడ్కో కాలనీ, సంతోషిమాత కాలనీ, ముస్లిం తాటిచెట్లపాలెం, పుట్ట బంగారమ్మ గుడి ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రయోగాత్మక సినిమా 'కళ్లు'



మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు ఎంవీ రఘు

సీతంపేట: కళ్లు ఒక ప్రయోగాత్మక సినిమా అని, విశాఖలోని ఎంతో మంది వ్యక్తుల సహకారం, స్థానిక కళాకారులతో ఈ చిత్రం తీశామని దర్శకుడు ఎం.వి.రఘు అన్నారు. కళ్లు చిత్రం తీసి 35 ఏళ్ల పూర్తయిన సందర్భంగా రంగసాయి మీడియా వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు మాట్లాడుతూ స్వాతిముత్యం సినిమా వచ్చిన రోజుల్లో కళ్లు సినిమా తీశామన్నారు. గొల్లపూడి మారుతీరావు రచించిన నాటికను సినిమాగా తీశామని తెలిపారు. ఈ సినిమాకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడినపాటలు, సిరివెన్నెల సాహిత్యం సినిమాకి హైలెట్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కళ్లు సినిమాకు 24 అవార్డులు రాగా, అందులో దర్శకుడికి 11 అవార్డులు రావడం విశేషమన్నారు. 1988లో విడుదలైన సనిమా వందరోజులు ఆడిందన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రఘు, ఇతర కళాకారులను సత్కరించారు. అనంతరం కళ్లు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రంగసాయి ప్రతినిధి ఎస్.నాగేశ్వరరావు, ఎంవీఎస్ హరనాథరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కళ్లు చిదంబరం కుమారుడు రామకృష్ణ, జనసేన నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణకు చర్యలు

నాలుగు రోజుల మూసివేత



మరమ్మతులకు గురైన స్విమ్మింగ్ పూల్ అడుగు భాగం



వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వాకింగ్ ట్రాక్‌కు పరిస్థితిని పరిశీలిస్తున్న వరప్రసాద్ ఇతర సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అనుబంధంగా ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణలో భాగంగా పనులు నిర్వహిస్తున్నట్లు పార్కు అధ్యక్షుడు సనలప వరప్రసాద్ చెప్పారు. ఐదేళ్ల తర్వాత దీన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు బుధవారం నుంచి నాలుగు రోజులు మూసివేస్తున్నట్లు ఆయన చెప్పారు. మోటారు మరమ్మతులతో పాటు దీని సామర్థ్యం పెంచడం, కుళాయిలు, బాత్ రూములను పరిశుభ్రం చేయడం, గతంలో వాడిన నీటిని పూర్తిగా తొలగించి కొత్తనీటితో నింపడం, కొలనులోని అడుగు భాగంలో మరమ్మతులు చేసి నాచు తొలగించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే పనులు పూర్తికావాల్సి ఉండగా.. వర్షాలు పడిన నేపథ్యంలో ఆలస్యమయ్యాయన్నారు. శిక్షణకు చేరిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు. పార్కులో ఇటీవల ఆధునికీకరించిన వాకింగ్ ట్రాకును వరప్రసాద్, ఉపాధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఇన్‌చార్జి కార్యదర్శి రఘురామపండాతో కూడిన సభ్యుల బృందం మంగళవారం పరిశీలించింది. వర్షాలు కారణంగా ట్రాక్ ఇసుక పొర పరిస్థితిని తెలుసుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌లు చెల్లించాలి

మద్దిలపాలెం: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి ఉన్న అలవెన్స్‌లను తక్షణం ప్రభుత్వం చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రెజరీస్ డైరెక్టర్ మోహనరావును మంగళగిరిలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ సానుకూలంగా స్పందించారని, త్వరలో బకాయిలు చెల్లించనున్నామని చెప్పారని రమణారెడ్డి తెలిపారు. డిపోల వారీగా బకాయి ఉన్న ఉద్యోగులకు వేతనంతో కలిపి చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం



స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: డిగ్రీలో ప్రవేశాల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నట్టు వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. స్పెషల్ కేటగిరీలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, ఎక్స్‌ట్రా కరికులం, క్యాప్ విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకూ జరుగుతుందన్నారు.

ఉక్కు పరిరక్షణకు కేటాయింపులేవీ?

- బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు మొండిచెయ్యి
- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1258వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: ఎన్నికల ముందు విశాఖ ఉక్కు పరిరక్షణ మా వల్లే సాధ్యమని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం నేడు పరిరక్షణకు బడ్జెట్‌లో కనీస కేటాయింపులు చేయకపోవడం అన్యాయమని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1258వ రోజు, మంగళవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. రాజధాని అమరావతికి రూ.15వేల కోట్ల నిధులు కేటాయిస్తామని బడ్జెట్‌లో పొందుపర్చిన కేంద్రం విశాఖ ఉక్కు విషయంలో మాత్రం కనీసం కేటాయింపులు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని, ఆర్థిక సహాయం అందించాలని మూడున్నర సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోపోవడం, తీరా ఎన్నికల్లో ప్రజలకు బీజేపీకి సముచిత స్థానం ఇచ్చినా కూడా మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇదే తీరు కనపర్చారన్నారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా నమ్మక ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలకు రాష్ట్రంపై ఎలాంటి అభిప్రాయం, ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టం అవుతోందన్నారు. కనీసం రెండు శాతం ఓట్లు కూడా లేని బీజేపీని పోటీ చేసిన దాదాపు అన్నిప్రాంతాల్లో గెలిపించిన రాష్ట్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహం అంతులేనిదన్నారు. దీక్ష శిబిరంలో నాయకులు కొమ్ము ప్రసాద్, పీవీబీవీ గోపాలరాజు, డి.ఆదినారాయణ, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, బీఎన్ రాజు, జి.ప్రభాకర్ రెడ్డి, జి.గురుమూర్తి, మధు, వై.శ్రీను, ఆకుల నూకరాజు, దండు మోహన్, మద్ది అప్పలరాజుతో పాటు ఉక్కు పరిరక్షణ కమిటీ, ఇంటక్ నాయకులు, సీవో అండ్ సీసీపీ, సీఆర్‌ఎంపీ, ఈఎండీ, ఈఆర్‌ఎస్, డీఎస్‌డబ్ల్యూ, సీఎంఈ విభాగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన కల్పించాలి

మహారాణిపేట: స్టాప్ డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. యూపీహెచ్‌సీ పరిధిలో గర్భిణులు ఎంత మంది ఉన్నారో జాబితా సిద్ధం చేయాలని, ఎనీమియా లబ్ధిదారులను గుర్తించాలని ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు తెలిపారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. ఓపీ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో సేవాభావం సొంతం



రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో కెరీర్ ఆపర్చునిటీస్ ఇన్ ఆర్మీ ఫోర్స్ ఇన్ ఇండియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ యువత దేశాభిమానం, సేవాభావాన్ని చాటుకునేందుకు ఎన్‌సీసీ చక్కటి అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ వైవీహెచ్‌ఎస్ ప్రసాద్ ఆర్మీ ఫోర్స్‌లో ఉన్న అవకాశాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ దేశాన్ని రక్షించే సైనికులకు ఎంతటి గౌరవం ఉంటుందో, అంతటి గౌరవం ఎన్‌సీసీ క్యాడెట్లకు కూడా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.